నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 25 నవంబర్ 2024 | NALGONDA

తన జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. రవీంద్రకుమార్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

– చందంపేట(దేవరకొండ), నవంబర్ 24

పత్తి రైతు దిగాలు

పెట్టుబడి రాక తెల్లబోతున్న రైతన్న

ముసురు వర్షాలకు కొంత దెబ్బ తిన్న పంట

జనవరి వరకు మూడు దశల్లో పత్తి తీయాల్సి ఉండగా నవంబర్‌లోనే లూటీ

మంచుతో పెరిగిన తేమ శాతం.. మద్దతు ధర కూడా రాని పరిస్థితి

పత్తి రైతులు దుఃఖంలో మునిగిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. సీజన్ ప్రారంభంలో పడిన వర్షాలను చూసి మంచి దిగుబడి వస్తుందని ఆశపడినా..ఎడతెరిపి లేకుండా పడిన ముసురుతో పంటలు దెబ్బ తిన్నాయి. ఆపసోపాలు పడుతూ వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటను కాపాడుకున్నా ఫలితం లేకపోయింది. పూత, కాత దశ రాగానే దసరా ముందు వర్షాలు ముఖం చాటేయడం, వాతావరణంలో మార్పులు రావడంతో పూత, పిందె రాలిపోయింది. చేను ఎర్రబడి బెందడి రోగం రావడంతో దిగుబడి పడిపోయింది. మూడు దశల్లో పత్తి తీయాల్సి ఉండగా, ఒకటి, రెండు సార్లకే చేన్లు లూటీ అవుతున్నాయి. జనవరి వరకు పత్తితో కళ కళ లాడాల్సిన చేన్లు నవంబర్‌లోనే బోసిపోతున్నాయి.

– నేరేడుచర్ల, నవంబర్ 24

చింతలపాలెంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ట్రాక్టర్‌లోని పత్తి తేమశాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దతు ధర పెరుగడంతో..

మద్దతు ధర గతేడాది కంటే వెయ్యి పెరుగడంతో ఈ సంవత్సరం రైతులు పత్తి సాగువైపు ఆసక్తి చూపారు. ఆరంభంలో పత్తి విత్తనాలు ధరలు పెరిగినా ఉత్సాహంగా సాగు చేశారు. సూర్యాపేట జిల్లాలో సుమారు 1.20లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఒక్కో ఎకరానికి రూ. 35వేల నుంచి రూ. 45 వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలు కూడా సమృద్ధిగా పడడంతో ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశపడ్డారు. కానీ వర్షాభావ పరిస్థితులు, తుఫాన్ కారణంగా ప్రస్తుతం ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వస్తుండడంతో నిరాశ చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి తీయడానికి పెరిగిన కూలి

పత్తి రైతులను కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. గతంలో పత్తి ఏరితే రోజు కూలీ రూ.250 ఇచ్చేవారు. ఇప్పుడు రోజుకు రూ. 350 నుంచి రూ. 400 ఇచ్చి తీసుకొస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కేజీల లెక్క చెల్లిస్తే ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక్కో కూలీకి సుమారు కేజీలు పత్తి తీయడంతో రూ. 500 వరకు చెల్లించడంతోపాటు వాహనాలకు అదనంగా ఖర్చు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

దక్కని మద్దతు ధర

సాధారణంగా మార్కెట్‌లో పంట ఉత్పత్తి తక్కువగా ఉంటే డిమాండ్ ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పత్తి దిగుబడి తక్కువగా ఉన్నా మార్కెట్‌లో ధర లేని పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కల్పించిన రూ. 7,521 మద్దతు ధర కూడా దక్కడం లేదు. నాణ్యతలేమి, తేమశాతం అనే కొర్రీలతో వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 6,500 నుంచి రూ. 7వేల లోపే ధర చెల్లిస్తున్నారు. ప్రసుత్తం సీసీఐని రంగంలోకి దించినప్పటికీ కూడా రైతులు ప్రయోజనం కలుగడం లేదు. దీంతో గ్రామాల్లో దళారులు చెప్పిన ధరకే పత్తిని విక్రయిస్తూ నష్టాలపాలవుతున్నారు. తేమ శాతం 8 నుంచి 12 శాతానికి మించితే పత్తి కొనుగోలు చేయలేమని సీపీఐ అధికారులు తెలుపుతున్నారు.

తేమ నమోదుపై అభ్యంతరాలు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం సీసీఐ కేంద్రంలో ఎక్కువ తేమ శాతం ఎక్కువ నమోదవుతుండడంతో పత్తి రైతులు నష్టపోతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండకు ట్రాక్టరులో తెచ్చిన పత్తిలో ఉబ్బుకు తేమ శాతం పెరుగుతోందని, దానినే మిషన్‌లో పెట్టి చూడడం వల్ల తేమ శాతం ఎక్కువ చూపిస్తున్నదని రైతులు చెబుతున్నారు. టక్కులో కంటే బయటకు తీసిన పత్తిలో తేమ శాతం నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

సీసీఐ కేంద్రంలో ధర ఇలా

సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించాలంటే ప్రభుత్వం ఈ విధంగా ధరలను నిర్ణయించింది. 8 శాతం ఉంటే రూ. 7,521, 9శాతం ఉంటే రూ. 7,445, 10శాతం ఉంటే రూ. 7,370. 11 శాతం ఉంటే రూ. 7,295, 12 శాతం ఉంటే రూ. 7,220 ఇస్తున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఎవరికి కూడా రూ.7వేలకు మించి ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతు కుదేలు

పత్తిసాగుతో రైతుల పరిస్థితి పూర్తిగా దయనీయంగా మారింది. భూమి ఉన్న రైతులు ఒక ఎకరాకు రూ. 15వేల నుంచి రూ.25వేల వరకు.. కౌలు రైతులు రెట్టింపు నష్టపోతున్నారు. ఎకరాకు రూ. 45వేల వరకు పెట్టుబడి పెట్టడంతోపాటు భూ యజమానికి ఎకరాకు రూ. 13 వేల నుంచి రూ. 16వేల వరకు కౌలు చెల్లించారు. దీంతో ఎకరాకు రూ. 25 వేల నుంచి 30 వేల వరకు నష్టాల్లో కూరుకుపోతున్నారు.

పెట్టుబడి కూడా కష్టమే..

ఈసారి పత్తిలో పెట్టుబడి రావడమే కష్టంగా మారింది. నేను నాకున్న రెండు ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. ఈ సారి పత్తి విత్తనాల రేటు, ఎరువుల రేట్లు పెరిగినా వెనుకాడకుండా నాణ్యమైన వాటిని తీసుకొచ్చి వేసిన. ముసురుతో వానలు పడడంతో పంట ఆశించిన స్థాయిలో రాలేదు. పంటంతా ఎర్రబడిపోయింది. దీంతో దిగుబడి బాగా తగ్గింది. కనీసం పెట్టున పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయాను.

-చింతపల్లి చిన్నసైదులు, కిష్టాపురం, చింతలపాలెం మండలం

నేడు జిల్లా మీదుగా కేటీఆర్

- **కొత్తగూడెం, చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, అర్వపల్లి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **ఘన స్వాగతం పలుకనున్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు**

నల్లగొండ ప్రతినిధి, నవంబర్24(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్‌లో మహాధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం జిల్లా మీదుగా ప్రయాణించనున్నారు. హైదరాబాద్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి 7:45 గంటల వరకు యాదాద్రి జిల్లా పరిధిలోని హైదరాబాద్ – విజయవాడ హైవే మీదుగా కొత్తగూడెం వద్ద ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశిస్తారు. అక్కడ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా నేతలు ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడ నుంచి ఉదయం 8:10 గంటలకు చౌటుప్పల్‌కు చేరుకుంటారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు స్వాగతం పలుకనున్నారు. అనంతరం నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాలకు 8:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతారు. తర్వాత 8:45 గంటలకు నార్కట్ పల్లి చేరుకొని నకిరేకల్ మీదుగా తుంగతుర్తి నియోజకవర్గంలోకి అడుగు పెడతారు. ఉదయం 9:30 గంటలకు అర్వపల్లిలో కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. తర్వాత జిల్లా దాటి ఉదయం 10:00 గంటలకు మరిపెడ బంగ్లా మీదుగా మహబూబాబాద్ చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నేతలు కూడా ఉండనున్నారు.

చెస్‌లో గెలుపొందిన ఉమ్మడి జిల్లా విజేతలతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చదరంగం ఆటతో మేధాశక్తి పెంపొందుతుంది

- **చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు అభినందనీయం**
- **క్రీడాకారులు నైపుణ్యతను సాధించేందుకు పోటీలు దోహదం**
- **మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**
- **ఉమ్మడి నల్లగొండ చెస్ విజేతలకు బహుమతి ప్రదానం**

సూర్యాపేట టౌన్, నవంబర్ 24 : శారీరక శ్రమ లేకుండా బ్రెయిన్ పవర్‌తో ఆడే ఆట చదరంగమని, ఈ ఆటతో మేధాశక్తి పెంపొందుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్, అండర్ 11, 15 చదరంగ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదరంగం ఆట అంటే తనకు మక్కువని, ఈ ఆటకు బ్రెయిన్ పవర్‌తోపాటు ఎంతో ఓపిక ఉండాలన్నారు. చెస్‌ను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలకంటే అసోసియేషన్‌లు, ఎన్‌జీఓలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్రికెట్ కంటే ఎక్కువగా ఒకప్పుడు ప్రపంచ చెస్ పోటీలు జరుగుతుంటే ప్రజలంతా చెస్ చాంపియన్‌షిప్ ఎవరికి వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూసేవారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా సూర్యాపేట జిల్లా నుంచి కూడా ఎంతో మంది చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్, సెల్‌ఫోన్ వైపు వెళ్లకుండా ప్రోత్సహించి పోటీలకు తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. ఈ పోటీల్లో మెడల్స్ పొందని వారు వచ్చే పోటీల్లో బాగా ఆడి రాణించాలన్నారు. అనంతరం ఆయన ఓపెన్ కేటగిరీ, అండర్ 11, అండర్ 15పోటీల్లో విజేతలైన బాల బాలికలకు షీల్డులతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, మీలా వంశీ, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీశ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ లింగారెడ్డి, ట్రెజరర్ వెంకటమురళి, ఆర్బిటర్స్ కరుణాకర్, విశ్వప్రసాద్, జానయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున దీక్షా దివస్ కార్యక్రమాలు చేపట్టాలి

- **ఇందుకోసం రేపు సూర్యాపేటలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం**
- **ముఖ్య అతిథిగా హాజరుకానున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**
- **మీడియా సమావేశంలో బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల**

మాట్లాడుతున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట, నవంబర్ 24(నమస్తేతెలంగాణ) : ఈ నెల 26న సూర్యాపేటలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరుగనున్న పార్టీ జిల్లా సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కోరారు. సూర్యాపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ జాతిపిత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ఈ నెల 26న జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. దీనికి జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, నాయకులు ఉప్పల ఆనంద్, నెమ్మాది భిక్షం, బాషా, ముద్ద మధుసూదన్‌రెడ్డి, రవిందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ ఇన్‌చార్జిల నియామకం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్24(నమస్తే తెలంగాణ) : ఈ నెల 29వ తేదీన పెద్దఎత్తున నిర్వహించనున్న దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. నల్లగొండకు మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట జిల్లాకు మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, యాదాద్రి భువనగిరికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నియామకం చేశారు. వీరు నేడు, రేపు ఆయా జిల్లాలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో దీక్షా దివస్ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

29న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- **26న పార్టీ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం**
- **బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్**

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, పక్కన జడ్పీ, మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు

నల్లగొండ రూరల్, నవంబర్ 24 : ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చోవడంతో తెలంగాణలోనే కాకుండా, దేశ వ్యాప్తంగా అప్పటి కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి వచ్చి తప్పని పరిస్థితుల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిందని, అందుకే ఈ నెల 29న నల్లగొండలో దీక్షా దివస్‌కు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అదివారం మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెలేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశామని, దీనికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలపై అమానుషంగా ప్రవర్తిస్తున్నదని, లగచర్ల గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వం రైతులపై దమనకాండను మానుకోవాలని హితవు పలికారు. మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేక హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో డ్రామా నడుపుతున్నారన్నారు. సీఎం పక్కా రియల్టర్‌గా పని చేస్తున్నాడని, బీఆర్ఎస్ హయాంలో ఎంతో కష్టపడి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే నేడు ఆ బ్రాండ్‌ను సర్వనాశనం చేశారని తెలిపారు. 29న ఏర్పాటు చేసే దీక్షా దివస్‌కు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కల్లుగీత కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, మాజీ ఆర్ఓ మాలె శరణ్యారెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్ మారగోని గణేశ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, యుగేంధర్‌రెడ్డి, బడుపుల శంకర్, కందుల లక్ష్మయ్య, శ్రీనివాస్, తవిట కృష్ణ, బొజ్జ వెంకన్న, మాజీ సర్పంచ్ గుండెబోయిన జంగయ్య, గంజి రాజేందర్, చంద్ర శేఖర్ రెడ్డి, వివేక్ పాల్గొన్నారు.

నీలగిరి పాతబస్తీలో అరుదైన శివాలయం

- **దేశంలో ఎక్కడాలేని విధంగా శివుడి పానవట్టం వద్ద హనుమాన్ విగ్రహం**
- **కందూరు చోడులు, కాకతీయ సామంత రాజుల కాలంలో నిర్మాణం**
- **నాటి చరిత్రకు సాక్ష్యం.. శిథిలావస్థకు చేరినా నేటికీ పూజలు**

నల్లగొండ పాత బస్తీ ఉమామహేశ్వరాలయంలో శివుడి పానవట్టం

హనుమాన్ విగ్రహం

రామగిరి, నవంబర్ 24 : నల్లగొండ అంటేనే చారిత్రాత్మక ప్రదేశంగా చెప్పుంటారు. ఇక్కడ ఎన్నో విశిష్టమైన ఆలయాలు ఉన్నాయి. పాతబస్తీలోని షేర్‌బంగ్లా సమీపంలో ఆర్యసమాజం(శిశుమందిర్) ఎదురుగా ఇండ్ల మధ్యలో అద్భుతమైన పురాతన శివాలయం ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా శివుడి పానవట్టం వద్ద హనుమాన్ విగ్రహం ఉండటం ఇక్కడి విశిష్టతగా చెప్పవచ్చు. దీనిని హనుమాన్ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానంగా పిలుస్తుంటారు. ఆలయంలో పెద్ద సాలగ్రామం ఉంది. ఆలయం వెలుపల అమ్మవారి విగ్రహం ఉంటుంది. కార్తిక మాసం కావడంతో నిత్యం ప్రత్యేక పూజలు సాగుతున్నాయి. నేడు కార్తిక చివరి సోమవారం సందర్భంగా పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రజలు, భక్తులు తమకు తోచినంత నిధులు సమకూర్చి దేవస్థానం నిర్వహణ చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. ఇక్కడ పూజలు చేస్తే అనుకున్నది నెరవేరుతుందని భక్తులు విశ్వసిస్తున్నారు.

ప్రాచుర్యంలోకి ఆలయం

నల్లగొండ పాతబస్తీలో ఓవైపు కాపురాల గుట్ట మరోవైపు బ్రహ్మంగారి గుట్ట ఉన్నాయి. షేర్‌బంగ్లా సమీపంలో కందూరు చోడులు, కాకతీయ సామంత రాజుల కాలంలో నిర్మించిన ఆలయం హనుమాన్ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానం. అప్పటి సామంత రాజులు ఆలయంలో పూజలు చేశారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఈ శివాలయంలో చాలా కాలం ఘనమైన పూజలు జరిగాయని, మధ్యలో కొంత కాలం శిథిలావస్థకు చేరుకొని మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చిందని అంటున్నారు. ఇండ్ల మధ్యలో ఉండడం వల్ల ఈ ఆలయం బయటికి అంతగా కనిపించడం లేదు.ఆలయ ప్రాంగణంలో పెద్దబావి ఉండేది దానిని నుంచి ఆ ప్రాంతం వారు మంచినీటిని తీసుకెళ్లే వారని స్థానికులు చెబుతున్నారు. స్థల ప్రభావంతో దానిని పూడ్చివేశారు.

కోరికలు నెరవేరుతాయి

హనుమాన్ సమేత ఉమా మహేశ్వర దేవాలయం అద్భుతమైనది. ఇక్కడ మూడు, ఐదు వారాలు పూజలు చేస్తే దీర్ఘకాలిక భక్తుల కోరికలు నెరవేరుతాయి. ఈ ప్రాంత వాసులు, భక్తుల సహకారంతో దేవస్థాంలో నిత్యపూజలు, పండుగలు చేస్తున్నాం. ఇలాంటి పురాతన ఆలయాలను వెలుగులోకి తెచ్చి నాటి చరిత్రను నేటి తరానికి అందించేలా పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది.

- పర్వతం శివకుమార్, ఆలయ అర్చకుడు, నల్లగొండ

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 24 : విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వంటగదిని, డైనింగ్ హాల్, పరిసరాలు, ఆట స్థలం, తరగతి గదులను పరిశీలించారు. బోధన, భోజనం తదితర వాటిని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంట చేసిన అనంతరం వంట పాత్రలను అక్కడే కాకుండా వేరే ప్రాంతంలో శుభ్రం చేయాలని సూచించారు. వంట గది కిటికీల గుండా పురుగులు, దోమలు, ఈగలు, ఇతర క్రిమికీటకాలు రాకుండా ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్, ఆర్సీఓను ఆదేశించారు. వంట మనుషులు తప్పనిసరిగా తలకు టోపీలు ధరించాలని, చేతులకు గ్లౌజులు పెట్టుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూసుకోవాలని తెలిపారు. వండటానికి కావాల్సిన సరుకులు ఎప్పుడికప్పుడే తీసుకురావాలని చెప్పారు. ఈ సందర్భంగా విదార్థినులు తమకు డైనింగ్ టేబుల్స్ వచ్చినా వాటికి స్థలం లేనందున వాడడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వెంట ఆర్డీఓ అశోక్ రెడ్డి, తాసీల్దార శ్రీనివాస్ ఉన్నారు.

డిసెంబర్4లోగా ట్రైనింగ్ కేంద్రాన్ని పూర్తి చేయాలి

డిసెంబర్ 4వ తేదీలోపు ఐటీఐ ఆవరణలో నిర్మిస్తున్న బాలుర అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె ఆదివారం ట్రైనింగ్ కేంద్రం పనులు పరిశీలించి మాట్లాడారు. అన్ని రకాల శిక్షణలు దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నిర్మిస్తున్నందున దీన్ని ఆలస్యం చేయకుండా పూర్తి చేస్తే డిసెంబర్–5న ప్రారంభం చేస్తామని తెలిపారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.